

## కేసుల పరిష్కారంపై సమీక్ష

**ప్రజాశక్తి-నెల్లూరు** :స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఫాస్ట్ ట్రాక్ కేసులపై ఆదివారం ఎస్‌పి సమీక్ష నిర్వహిపంచారు. గుంటూరు రేంజ్ ఐజి జి.పాలరాజు,ఎస్.పి. డాక్టర్ కె. తిరుమలేశ్వర రెడ్డి, పాల్గొన్నారు. డి.జి.పి అదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్" లో భాగంగా ప్రయారిటీ కేసులను(ఫాస్ట్ ట్రాక్ కేసులు) కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ప్రాధాన్యతతో మోనిటరింగ్ చేయాలని ఐజి జి.పాలరాజు ఎస్‌సి తిరుమ లేశ్వరరెడ్డికి సూచించారు. జిల్లాలోని కేసుల ప్రాధాన్యతను బట్టి ప్రతి ఒక్కరు కొన్ని కేసులను స్వీకరించి వాటి ట్రైల్ లను ప్రతి ఎస్‌హెచ్‌ఓ, సిఐ, డిఎస్‌పిలు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. విచారణ అధికారులు తీసుకున్న ఫాస్ట్ ట్రాక్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు, ట్రయల్ సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మాట్లాడుతున్న ఐజి పాల్‌రాజు, ఎస్‌పి

# ఎన్నికల్లో ఏమైందో చెప్మా..!

## పంచాయతీ ఫలితాలపై వైసిపిలో అలజడి - టిడిపి అధిష్టానం సంతృప్తి

**పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార వైసిపిలో అలజడి సృష్టించాయి. 2024 సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల పోలింగ్‌లో వైసిపి చితికిలపడింది. ఏకగ్రీవాలు చేసుకున్నా, ప్రజలు ఓట్లు వేసే విషయంలో అధికార పార్టీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. అనేక రకాల పథకాలు, నగదు పంపిణీ, జనం అంతా వైసిపితో ఉన్నారు. 175 కి 175 గెలుస్తాం.. అంటూ గొప్పలు చెబుతోన్న అధిష్టానానికి ఈ ఎన్నికలు చెంపపెట్టుగా కనిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో అన్నింటిలో వైసిపి హవా కనపరిచింది. బలమైన నెల్లూరు జిల్లాలో ప్రస్తుత ఫలితాలను ఆపార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అధిష్టానం కూడా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క సర్వేపల్లిలో మాత్రమే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన ప్రాభల్యం నిలుపుకున్నారు.ఈ ఫలితాలు చూస్తుంటే వైసిపి భవిష్యత్ కనిపిస్తుందని రాజకీయ విశేషకులు అంటున్నారు.**

**ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి**

పంచాయతీ ఎన్నికల ఫలితాలు అందరిలో ఉత్కంఠ రేపుతున్నాయి. శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికారపార్టీకి ఊహించని షాక్ తగిలింది. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 95 శాతం వైసిపి విజయం సాధించింది. పోటీ నిలవడానికి కూడా టిడిపి భయపడిపోయింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి, వైసిపి నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. అత్యధిక స్థానాల్లో టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం 11 వార్డులు, ఒక్క సర్పంచ్ స్థానానికి పోలింగ్ జరగ్గా అందులో ఆరుచోట్ల టిడిపి, ఐదు చోట్ల వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. చేజర్ల మండలంలో వార్డుకు లక్కి డ్రాలో వైసిపి గెలుచుకుంది. ఒక్క సర్వేపల్లి మండలం తప్ప వైసిపి ఎక్కడా ఆధిక్యత కనిపించలేకపోయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 28 మండలాల్లో 60 గ్రామ పంచాయతీల్లో రెండు సర్పంచ్‌లు, 63 వార్డులకు ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఒక సర్పంచ్, 50 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. రెండు వార్డులకు నామినేషన్ దాఖలు చేయలేదు. అధికారపార్టీకి ఇంకా ఆరు నెలల సమయం ఉండడం, గ్రామాల్లో వివాదాలు, ఇష్టం లేని ఇతర పార్టీలు పోటీకి నిలవలేదు. ఇతర పార్టీ నేతలు కూడా మౌనంగా ఉండిపోయారు. మొత్తం 11 వార్డులు, ఒక్క సర్పంచ్ స్థానాఇకి శనివారం పోలింగ్ నిర్వహించారు. జలదంకి మండలం లింగరాజు అగ్రహారం పంచాయతీ సర్పంచ్‌కు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన మంగల తిరుమల 88 ఓట్లతో విజయం సాధించారు. . జలదంకి మండలం వేములపాడు పంచాయతీలోని 7 వార్డుకు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన పోట్లూరి ఆదిలక్ష్మమ్మ 34 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ 3 వార్డులో టిడిపి అభ్యర్థి విజయం సాధించారు. కోవూరు మండలం పాటూరు పంచా యతీలో 2 వార్డులో టిడిపి బలపరిచిన అభ్యర్థి రామిశెట్టి రాజేశ్వరి 26 ఓట్లుతో గెలిచింది. లింగసముద్రం మండలం చిన్నపవని గ్రామంలోని 2 వార్డులో . టిడిపి అభ్యర్థి కోటేశ్వరమ్మ విజయం సాధించింది. ఉలవపాడు మండలం, ఆత్మకూరు గ్రామంలో 5 వార్డులో టిడిపి అభ్యర్థి సి కోటేశ్వరావు గెలిచారు.. రాపూరు మండలం, బొజ్జనపల్లి పంచాయతీలో 8 వార్డులో టిడిపి అభ్యర్థి నిమ్మల రమణమ్మ 23 ఓట్లతో గెలిచారు. రాపూరు మండలం గిలకపాడు పంచాయతీల్లో 3 వార్డులో వైసిపి అభ్యర్థి చల్లా రాజగోపాల్‌రెడ్డి 42 ఓట్లతో గెలిచారు. చేజర్ల మండలం పత్తిపాడు పంచాయతీలో వైసిపి అభ్యర్థి మస్తాన్‌బీ గెలిచారు. సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలులో మూడు స్థానాలు వైసిపి గెలుచుకుంది. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలో మాత్రమే వైసిపి ఆధిక్యత సాధించింది.

జలదంకి మండలం, లింగరాజు అగ్రహారం పంచాయతీ సర్పచ్‌గా ఎన్నికైన టిడిపి అభ్యర్థి తిరుమలకు స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

**ఏమైంది చెప్మా...!**

పంచాయతీ ఫలితాలపై వైసిపి అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున పథకాలు పవేశపెట్టి, కోట్ల రూపాయాలు నగదు పంపిణి చేస్తూ, 13 వేల మంది వలంటీర్లు, 8 వేల మంది సచివాలయ ఉద్యోగలు పనిచేస్తున్నా నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఈ ఫలితాలపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఏందుకు జరిగింది. ఎలా జరిగింది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ జిల్లాలో భారీ మెజార్టీ వచ్చింది. పట్టణ ప్రాంత ఓటర్లు కనుక టిడిపికి వేశారని భావించారు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామా ల్లోనూ వ్యతిరేకత ఉందా అని ఆరా తీస్తున్నారు. ఓట్లు, ఇతర వివరాలు తెప్పించు కుంటున్నారు. టిడిపి విజయం పట్ల ఆపార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం కూడా సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ ఫలితాలు 2024 ఎన్నికలకు ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. అధికారపార్టీ ఎలాంటి ఎత్తులు వేస్తుందో చూడాలి.

# 'వియ్ -20' సదస్సును అడ్డుకోవడం హేయం

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు

**ప్రజాశక్తి-నెల్లూరు**

సెప్టెంబర్‌లో నిర్వహించతలపెట్టిన జి -20 దేశాల సమ్మిట్ నేపథ్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని సూర్జిత్ భవన్‌లో ప్రముఖ ఆర్థిక వేత్తలు, మేధావులు, పాత్రికేయులు, రాజకీయవేత్తలు కలిసి నిర్వహించతలపెట్టిన వియ్ - 20 పీపుల్స్ సమ్మిట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా అడ్డుకోవడాన్ని సిపిఎం శ్రేణులు నిరసించాయి. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీ నగర్‌లోని సిపిఎం కార్యాలయం నుంచి మినీ బైపాస్ వద్దనున్న జ్యోతిరావు పూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఢిల్లీలో జి20 దేశాల సమ్మిట్ సందర్భంగా 3 రోజులు పాటు ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న సెమినార్‌ను నిరంకు శంగా సూర్జిత్ భవన్ కు తాళాలు వేసి పోలీసు బలగాలతో బిజెపి ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. భారతదేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని తెలియజేసే వాక్ స్వాతంత్ర్య హక్కు కలిగి ఉన్నారన్నారు. బిజెపి ప్రభుత్వం నిరంకుశ, నియంతత్వ విధానాలను అవలంబించడం సిగ్గుచేటన్నారు. బిజెపి అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపు నిచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగేశ్వరరావు, పి. సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, కత్తి పద్మ,మూలం ప్రసాద్,ఆర్ నగేష్, చిరంజీవి, ఎన్.వి సుబ్బమ్మ, చెంగయ్య, శాఖా కార్యదర్శులు అల్లంపాటి. శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, ఫయాజ్, రవుఫ్, బాబురావు పాల్గొన్నారు.

సిపిఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు

**సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో..**

మోడి ప్రభుత్వం హరికిషన్ సింగ్ సూ ర్జిత్ భవన్ కు తాళాలు వేయటం పిరికిపంద చర్య అని సిపిఎం నాయకులు విమర్శించారు. ఆదివారం ఢిల్లీలోని హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవనానికి కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా తాళాలు వేయటాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులంద రూ ఖండించాలంటూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప గుడి సెంటర్లో నిరసన చేపట్టారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్టయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నిరంకుశ ,నియంత్రత్వ పాలన హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవనానికి పోలీసులు చేత తాళాలు వేయటంతో బట్ట బయలైందన్నారు. జి 20 ప్రతినిధులు సెప్టెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో సమావేశం కాబోతున్నా తరుణంలో ఢిల్లీలో ఆగస్టు 18, 19, 20 తేదీల్లో 70 ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, పౌర సంఘాలు ఇండోర్ మీటింగ్ పెట్టుకుని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో వియ్ 20 పీపుల్స్ సెమినార్‌కు పిలుపునిచ్చాయన్నారు. ఈ జాతీయ సెమినార్‌లో భారతదేశం యొక్క స్థితిగతులు బిజెపి పాలన యొక్క బుల్డోజర్ విధానాలు, మణిపూర్లో హింసకాండలు, హర్యానా అల్లర్లు ,చర్చిలు ,మసీదులు ధ్వంసం చేయడం, దళితులు మహిళలు, మైనార్టీలపై దాడులు చేయటం, ప్రభుత్వ సంస్థల అమ్మి వేయడం తదితర సమస్యలపై చర్చించతలపెట్టాయన్నారు. సెమినార్ జరిగితే బిజెపి పాలన బండారం బయటపడుతుందనే భయంతో అక్కసుతో నిరంకుశత్వంగా అడ్డుకుందని విమర్శించారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కిన్నెర కుమార్, కొండా ప్రసాద్, పార్టీ రూరల్ కమిటీ సభ్యులు దేవతాటి సంపత్ కుమార్ పాల్గొన్నారు. శాఖా కార్యదర్శులు పి శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు శంకర్, సీనియర్ నాయకులు ఏ. మోహన్ ఉన్నారు.

రూరల్ కమిటీ ఆధ్వర్యంలో..

కందుకూరులో..

**కందుకూరులో నిరసన**

**ప్రజాశక్తి-కందుకూరు :** వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జి -20 సమావేశాలను పురస్కరించుకొని వియ్ -20 పేరుతో శనివారం ఢిల్లీలోని సిపిఎం (హరికిషన్ సూర్జిత్ సింగ్ భవన్) కార్యాల యంలో 70కి పైగా వివిధ ప్రజా, కార్మిక, పౌర సంఘాలు మేధావులు పాల్గొని నిర్వహించతలపెట్టిన సెమినార్‌ను శనివారం ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో నిరంకుశత్వంగా అడ్డుకున్నారు. ఈ చర్యను నిరసిస్తూ ఆదివారం కందుకూరు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాల ఇన్‌ఛార్జి జీవీబీ కుమార్ అధ్యక్షత వహించారు. సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్.ఏ.గౌస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ఇటువంటి దుర్మార్గమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించు కోవాలన్నారు. బిజెపి విధానాలను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ముక్త కంఠంతో ఖండించాలన్నారు. సిపిఎం కందుకూరు పట్టణ నాయకులు ఎస్.కె. మున్వర్ సుల్తానా, ఎం. పద్మ , దాసరి రామమూర్తి, టి .వెంకట్రావు మెడ బలిమి. ప్రసాద్,డి. యం. రాయుడు, పి.వి రామారావు, జి. శ్రీనివాసులు,నాగేశ్వరరావు ఉన్నారు.

## రాజీవ్ గాంధీకి నివాళి

**నెల్లూరు :** కీర్తిశేషులు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిను పురస్కరించుకుని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్ రెడ్డి స్థానిక ఎసి .సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఉన్న రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని త్రివర్ణంలో తయారు చేసిన భారీ కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు సి.వి. శేషారెడ్డి,పి.సి.సి అధికార ప్రతినిధి లేళ్లపల్లి.సురేష్ బాబు, నగర ఇన్చార్జీ షేక్.ఫయాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా.అనిల్ కుమార్, పి.సి.సి కార్యదర్శి నట్రంభాక.మోహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పప్పర్తి గణేష్ బాబు, ఎన్.యెస్.యు.ఐ.అధ్యక్షుడు రాజా, ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి,మైనార్టీ అధ్యక్షుడు షేక్.అల్లావుద్దీన్, మహిళా నగర అధ్యక్షురాలు మంజుల,చేను. సుజాత, మండలాధ్యక్షుడు బిట్టా.కిషోర్ బాబు,నాగిరెడ్డి.రాజేష్ రెడ్డి, మున్నా, మహేష్, రెహమాన్,ఫజులుద్దీన్,అరవ దాసు, మోహన్,ఇమ్రాన్ ఉన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పెనుబర్తిలో 'మహాశక్తి'

**ప్రజాశక్తి -నెల్లూరు** :నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పెనుబర్తి గ్రామంలో ఆదివారం మహాశక్తి చైతన్య రథయాత్ర జరిగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నెల్లూరు రూరల్ పరిశీలకులు రాచమల్లు శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు సిఎం అయితే 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500 నేరుగా మీ ఇంటికే చేరుతాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. తల్లికి వందనం పేరుతొ ఇంట్లో చదువుకొనే ప్రతి బిడ్డకు సంవత్సరానికి 15వేల ఇస్తారన్నారు. ప్రతి ఇంటికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. పల్లంరెడ్డి భాస్కర్ రెడ్డి, పల్లంరెడ్డి దినేష్ రెడ్డి, శివయ్య నాయుడు, అలగల మల్లికార్జున, పోలయ్య, వడ్లమూడి వెంకటేష్, బి. వెంకటేశ్వర రావు, తాండ్ర పెంచలయ్య, అంకయ్య, ప్రసాద్, విష్ణు కుమార్, సుమంత్ రెడ్డి, శ్రీనివాసులు, కేతు రమేష్ రెడ్డి, దువ్వూరు వెంకట శేషు రెడ్డి, తాండ్ర పోలయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, కన్నా రాగయ్య, భక్తవత్సల రెడ్డి, మహేష్ రెడ్డి, రవి, కేతు శ్రీహరి రెడ్డి, ప్రసాద్, జ్యోతి, అరుణమ్మ, నారాయణమ్మ, రవణమ్మ ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

## ఎస్ఐలకు స్థానచలనం

**ప్రజాశక్తి-నెల్లూరు** :జిల్లాలోని పలు పోలీస్టేషన్‌లో ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న ఆరుగురికి స్థానచలనం కలిగింది. ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాపూరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వై.రంగనాథ్ గౌడ్‌ను కోవూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎం. బాజీబాబును లింగస ముద్రం పోలీసు స్టేషన్‌కు, విఆర్‌లో ఉన్న ఎల్ సుధీర్‌కుమార్‌ను చిన్నబజారు పోలీసు స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. విఆర్‌లో ఉన్న ఆర్ఎస్ శ్రీనివాస్‌ను వేదాయ పాళెం పోలీసు స్టేషన్‌కు, నవాబుపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న జి.వీరేంద్ర బాబును ఇందుకూరుపేట పోలీసు స్టేషన్‌కు ట్రాన్సఫర్ చేయగా ఇందుకూరు పేట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.రాజ్‌కుమార్‌ను విఆర్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## విఆర్‌కు ఎస్ఐ రాజకుమార్

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

ఇందుకూరుపేట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.రాజ్ కుమార్ విఆర్‌కు బదిలీ చేసుకున్నట్లు ఎస్‌పి కె.తిరుమలేశ్వర్ రెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. నవాబ్‌పేట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి వీరేంద్రబాబును ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

# 100 రోబోటిక్ శస్త్ర చికిత్సలు

## అపోలో ఆస్పత్రి వైద్యులు వెల్లడి

**ప్రజాశక్తి-నెల్లూరు**

అతి తక్కువ కాలంలో 100 రోబోటిక్ మోకాళ్ళ శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన గుర్తింపును పొందినట్లు అపోలో హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఆదివారం నగరంలోని అపోలో వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ నీ సర్జరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి... డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి, డాక్టర్ పమ్మి కార్తీక్ రెడ్డి బందం సాధించిన ఘనతను మీడియాకు వివరించారు. డాక్టర్ మదన్‌మో హన్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణంగా అయితే మోకాలి శస్త్ర చికిత్సల్లో వైద్యులు సాంప్రదాయ సాధనాలపై ఆధారపడాల్సి వచ్చేందన్నారు. నేటి ఆధునిక యుగంలో వైద్య చికిత్సలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక పరికరాల సహాయంతో ప్రత్యేక శస్త్ర చికిత్స అందుబాటులోకి వచ్చాయన్నారు. రోబిటిక్ విధానంతో మోకాలి మార్పడి అమరికను అంచనా వేసి శస్త్ర చికిత్సలు దిగ్విజయంగా చేస్తున్నామన్నారు. ఇది పూర్తిగా వైద్యుని నైపుణ్యంపై ఆధారపడి ఉంటుదన్నారు. నెల్లూరు అపోలో హాస్పిటల్ ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన రోబోటిక్స్ సర్జరీ ద్వారా త్రీడి సీటి ఆధారిత వర్చువల్ ప్లాన్ సహాయంతో వైద్యుడు ఓ ప్రణాళికా బద్దంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల ఎముకల్లో ఉన్న లోపాలు కూడా గుర్తించి ఖచ్చితత్వంగా శస్త్ర చికిత్స పూర్తి చేస్తున్నామన్నారు. రోబోటిక్ సర్జరీ ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో ఓ విప్లవాత్మకం అన్నారు. రోబోటిక్ విధానంలో శస్త్ర చికిత్స చేయించుకోవాలనుకునే వారు ముందుగా ఆయా హాస్పిటల్ చరిత్రతో పాటూ ఎఫ్.డి.ఐ ఆమోదం, క్లినికల్ లెగసీ, గతంలో ఆయా హాస్పిటల్ లో జరిగిన రోబోటిక్స్ సర్జరీల వివరాలు తెలుసుకోవడం మంచిదని డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. నెల్లూరు అపోలో హాస్పిటల్ ఖచ్చితత్వంతో కూడిన రోబోటిక్స్ విధానం ద్వారా శస్త్ర చికిత్సలను నిర్వహిస్తుందన్నారు. అతితక్కువ కాలంలోనే 100 రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడిస్తూ తన వైద్య బందానికి ఆయన అభినందనలు తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు

# క్రికెట్ విజేత 'నెల్లూరు రాయల్స్'

**ప్రజాశక్తి-నెల్లూరు**

స్థానిక బుజబుజనెల్లూరు ప్రాంతంలోని క్రికెట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్రా స్టేడియంలో రావాణా శాఖ సిబ్బంది నిర్వహించిన జిల్లా క్రికెట్ టోర్మమెంట్ విజేతగా 'నెల్లూరు రాయల్స్' జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఈ క్రికెట్ టోర్మమెంట్‌లో రెండు జట్టు పాల్గొన్నాయి. నెల్లూరు రవాణా శాఖ కార్యాలయం సిబ్బంది నెల్లూరు రాయల్స్ పేరుతో ఒక జట్టు, కావలి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం సిబ్బంది కావలి కింగ్స్ టీం పేరుతో రెండవ జట్టు ఈ పోటీలో పాల్గొన్నాయి. నెల్లూరు రాయల్స్ క్రికెట్ టీంకు ఉప రవాణాకమిషనర్ శ్రీచందర్ కెప్టన్‌గా వ్యవహరించగా కావలి కింగ్స్ జట్టుకు సుధాకర్‌రెడ్డి కెప్టన్‌గా వ్యవహరించారు. మొదటగా టాస్ ఎంచుకున్న నెల్లూరు రాయల్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకున్నారు. మొట్టమొదటిగా బ్యాటింగ్ చేసిన కావలి కింగ్స్ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 147 పరుగులు సాధించింది. 148 పరుగుల లక్ష్యంతో ఆటను ప్రారంభించిన నెల్లూరు రాయల్స్ క్రీడాకారులు కేవలం మూడు వికెట్లను కోల్పోయి, మూడు ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అధిగమించారు. ఈ టోర్మమెట్‌లో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శించిన ఎంబిఐ స్వప్నిల్ కుమార్ రెడ్డికి ఉత్తమ బ్యాట్స్మెన్‌గా, హోంగార్డు ఆదినారాయణ ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నెల్లూరు ఉప రవాణా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కష్ణయ్య మెమెంటోస్ అందుకున్నారు. అందరిలో క్రీడా స్ఫూర్తి నిలిపి మానసిక ఒత్తిడి అధిగమించేలా నిరంతర ప్రక్రియకు భిన్నంగా ఈ క్రీడా పోటీలో సిబ్బంది ప్రోత్సహించినందుకు ఉప రవాణా కమిషనర్ శ్రీ చందర్‌ను సిబ్బంది ప్రశంసించారు.

## పవన్ కళ్యాణ్ సిఎం కావాలని సైకిల్ యాత్ర

**ప్రజాశక్తి-కావలి**

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎపికి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ 13వ తేదీ నుంచి యనమల మధు, హైదరాబాద్ నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సూర్యపేట జిల్లా, నోటంకి మండలం, పెద్దనిమ్మళ్లీ గ్రామం నుంచి బయల్దేరాడు. యనమల మధు ఆదివారం మార్గం మధ్యలో కావలి నియోజకవర్గంలో ఆగారు. కావలి పట్టణం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఉడిపిహోటల్ యజమాని కే.ప్రదీప్ భోజనం ఆతిథ్యం ఇచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య, నాయకులు ఆలా శ్రీనాథ్, నాగార్జున, షేక్ అబ్దుల్ నయీమ్, తోట శరన్, ఎం.శ్రీను, ఆర్ రాజా, షేక్.సుల్తాన్ బాబా, శివ, టి.శ్రీను, సుభాని, జనసైనికులు పాల్గొన్నారు.

## తల్లీ కూతుళ్లపై దాడి

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

మండలంలోని పాములవారిపాలెం గ్రామంలోని ఎస్.కె.వహీదా, కూతురు జాస్మిన్ అను తల్లి కూతుళ్లపై, అత్త, ముగ్గురు కొడుకులు విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాలు మేరకు.. పాముల వారి పాలెంకు చెందిన ఎస్‌కె వహీదా తన కూతురుతో ఇంట్లో ఉండంగా తన విడాకులు తీసుకున్న భర్త ఎస్.కె.హుమాయన్, ఎస్.కె.హుస్సేన్, మహమ్మద్ రఫీ, మస్తాన్‌బీ అనే నలుగురు వ్యక్తులు కలిసి తనపై, తన కూతురు జాస్మిన్‌పై విచక్షణారంగంగా ఇనుప చువ్వలతో దాడి చేశారని వాపోయింది. రెండు రోజులు ముందు తానులేని సమయంలో ఒక లాయరుతో ఆ నలుగురు వ్యక్తులు కలిసి తన ఇంటిలోని సామానును పగలగొట్టారని పేర్కొన్నారు. వివరాలు తెలుసుకున్న స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బాధితులపై జరిగిన దాడిలో గాయాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. గాయపడిన వహీదాని, ఆమె కుమార్తె జాస్మిన్‌ను 108 వాహనంలో నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

## 'ప్రకాశం'లో 'నామట్టి - నాదేశం'

**ప్రజాశక్తి-కందుకూరు :** మన దేశ అమర సైనికులు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను సన్మానించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో మేర మట్టి.. మేరా దేష్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా 34 (ఎ) బెటాలియన్ అండర్‌లో ఉన్న ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ లోని ఎన్‌సిసి యూనిట్ తరపున మేరి మట్టి.. మేరా దేశ్ ( నామట్టి.... నాదేశం) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య కళాశాలలో పలుచోట్ల మొక్కలు నాటారు. అమర సైనికుల త్యాగాలు మరువలేనివని వారికి గుర్తుగా మొక్కలు నాటడం గొప్పవిష యమన్నారు. అనంతరం ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్.సీ.సీ నిర్వాహ కులు షేక్ మిరావలి , ఎన్‌సిసి ఆఫీసర్ యస్‌కె హిమామ్‌షా మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థులు విద్యతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులను అభినందించారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలకు సహకరిస్తున్న కళాశాల యాజమాన్యానికి ఎన్‌సిసి ఆఫీసర్, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

## రూ. లక్ష విరాళం అందజేత

**ప్రజాశక్తి-కందుకూరు** :వలేటివారిపాలెం మండలం కలవళ్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయానికి రూ 100000 దేవస్థానం కమిటీ సభ్యులకు ఆదివారం టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ విరాళం ఇచ్చారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దోమల నియంత్రణకు ప్రతిజ్ఞ

**ప్రజాశక్తి-ఉదయగిరి**

దోమల నియంత్రణకు సామాజిక ఆరోగ్య సిబ్బందితో వైద్యులు డాక్టర్ శంశుదిన్ ప్రతిజ్ఞను చేయించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దోమల ద్వారా వ్యాపించే వ్యాదుల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్‌లు రమాదేవి, అంజమ్మ, శానిటేషన్ సూపర్ వైజర్ షేక్ సికిందర్ శానిటేషన్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ రవీశ్ కోడూరు, జిడిఎ సుధీర్, సెక్యూరిటీ అశోక్, అటెండర్ ఖజరహంతుల్లా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగో వార్డు ఏకగ్రీవం

**ప్రజాశక్తి-కొడవలూరు**

మండలంలోని రెండు పంచాయతీల్లో నాలుగు వార్డులకు ఉప ఎన్నికలు రాగా ఆ 4 వార్డులను వైసిపి ఏకగ్రీవంగా గెలుచుకొంది. గౌతమ్ నగర్ పంచాయతీలో 3వ వార్డులో ఇస్సారపు శంకరమ్మ, 6వ వార్డు నుంచి పన్నం వెంకటకృష్ణయ్యలు ఏకగ్రీవంగా గెలుపొందారు. అదేవిధంగా పాత వంగళ్లు పంచాయతీలో రెండవ వార్డు నుంచి తైదుల బుజ్జమ్మ మూడో వార్డు నుంచి దానం అనూషలు వైసిపి బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుపొందారు. ఏకగ్రీవంగా గెలుపొందేందుకు కృషి చేసిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాగిరెడ్డి, సునీల్ కుమార్, బెజవాడ లక్ష్మీబాయిలను డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు ప్రత్యేకంగా అభినందించారు.

## నిలిచిన పీర్ల పండుగ

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

మండలంలోని విరువూరులో ఎంతో భక్తి శ్రద్ధలతో సజావుగా ప్రారంభమైన పీర్లు పండగ వర్గ విభేదాలతో రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో ఈ కార్యక్రమాన్ని పోలీసులు అర్ధాంతరంగా నిలిపివేశారు. మరికొద్ది గంటల్లోనే నిప్పుల గుండాన్ని ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో తొక్కి కార్యక్రమం పూర్తయ్యేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు ఆపడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాతం చూపకుండా కార్యక్రమాన్ని పూర్తి చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## కాకర్ల సురేష్‌కు అభినందనలు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : పేదల ఆరోగ్యాన్ని ముందుగా తెలుసుకొని ప్రస్తుత సీజన్‌లో ఏడు మంది వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్న టిడిపి నాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్‌కు లెక్కలవారి పాలెం గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని వింజమూరు మండలం లెక్కలవారి పాలెంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ 7 మంది ఉన్నత డాక్టర్ల పర్యవేక్షణలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. నియోజకవర్గం లోని పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఎన్‌టిఆర్ సంజీవనీ ఆరోగ్య రథంతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు డాక్టర్ సంధాని, డాక్టర్ జె.సంధ్య, డాక్టర్ కె.మనోజ్ కుమార్, డాక్టర్ టి.లాస్య, డాక్టర్ కె.సంతోషి, డాక్టర్ కె.గిరీష్ కుమార్ డాక్టర్ రవికుమార్ అందిస్తున్న మెరుగైన వైద్యంపై గ్రామస్తులు కాకర్ల సురేష్‌కు అభినందనలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పేషెంట్లు మాట్లాడుతూ ఇంత మంది డాక్టర్లతో తమ గ్రామానికే వచ్చి వైద్య నిర్వహించి మెరుగైన వైద్యం అందివడం ఇదివరకెప్పుడూ తాము చూడలేదని ప్రస్తుత సీజన్లో ఇంట్లో కుటుంబ సభ్యులు అంతా ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రయివేటు వైద్యశా లలు ఫీజులు భారమై బాధపడుతున్న తరుణంలో ఇలా ఉచిత వైద్యసేవలు అందిం చడం సంతోషదాయకమన్నారు. గద్దె జయంత్, చంద్రశేఖర్ ఎన్ఆర్ఐ కోనేటి మార్కండేయులు, రాము, కముద్రా శ్రీనివాసులు, బండారం సత్యనారాయణ, భువనేశ్వరం విజయ్, మాలాద్రి, గ్రామస్తులున్నారు.

## నేడు కృష్ణాపురంలో ఆస్పత్రి ప్రారంభం

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని కృష్ణా పురంలో అన్ని వసతులతో కూడిన ఆసుపత్రిని సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తు న్నట్లు డాక్టర్ దివ్యారెడ్డి తెలియజేశారు. డాక్టర్ దివ్యారెడ్డి చాబోలు గ్రామంలో జన్మించి జర్మనీలో వైద్య విద్యను అభ్యసించి మలేషియా, చైనా, కొరియా లాంటి దేశాలలో ఇంటర్నెట్, క్యాంప్ నిర్వహించి, స్వదేశానికి తిరిగి వచ్చి ఢిల్లీ, తెలంగాణలోని మారుమూల గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలందించారు. ఒబెష్, కార్డియాలజీ, రెస్పిరేటరీ, న్యూరాలజీ, నెఫ్రోలజీ, డెర్మటాలజీ విభాగాలలో ఆమె ప్రజలకు వైద్యం చేశారు. మెట్ట ప్రాంతంలో ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం శుభ పరిణామమని పలువురు ప్రజాప్రతినిధులు ప్రజలు అభినందనలు తెలియజేశారు.

## వార్డుమెంబర్‌కు అభినందనలు

**ప్రజాశక్తి-సీతారామపురం** : ఇటీవల పంచాయతీ నోటిఫికేషన్ విడుదలై జరిగిన ఉప ఎన్నికలలో సీతారామపురం పంచాయతీలోని 6వ వార్డుకు నోటిఫికేషన్ విడుదల చేయగా టిడిపి మద్దతు దారుడైన బండి రవికుమార్ ఏకగ్రీవంపై మాజీ ఎంఎల్ఎ బొల్లినేని రామారావు శాలువా కప్పి అభినందించారు. మండల టిడిపి కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు, సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల ఫలితాలపై బొల్లినేని హర్షం

**ప్రజాశక్తి-కలిగిరి** : ఉదయగిరి నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో టిడిపి అధిక స్థానాలు సాధించడంపై మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ. వైసిపి సాగిస్తున్న అరాచక పాలన ప్రజలకు అర్థమైంది అనడానికి ఈ ఉపఎన్నికల ఫలితాలే నాంది అన్నారు. నియోజకవర్గంలో 15 వార్డుల్లో టిడిపి 10 కైవసం చేసుకుందని, ఒక సర్పంచ్ స్థానానికి పోటీ జరగగా టిడిపి దక్కించుకుందని చాలా సంతోషమన్నారు.

## నూతన దంపతులకు బొల్లినేని ఆశీర్వాదం

**ప్రజాశక్తి-సీతారామపురం** : మండలంలోని పబ్బులేటిపల్లి పంచాయతీ సర్పంచ్ ఎం.ఆదెయ్య కుమారుడు కళ్యాణ్ వివాహ వేడుకలకు ఉదయగిరి మాజీ శాసనసభ్యుడు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొల్లినేని రామారావు హాజరయ్యారు. నూతన వధూవరులు కళ్యాణ్, రాధా లను ఆశీర్వదించారు. అనంతరం వివాహ వేడుకలకు హాజరైన మండల టిడిపి నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు, మండల సీనియర్ నాయకులు గాజులపల్లి చంద్ర రెడ్డి, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ఆలూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిలో నుంచి జనసేనలోకి చేరిక

**ప్రజాశక్తి-కలిగిరి** : మండలంలో వైసిపి అధికార పార్టీ నుండి జనసేన పార్టీలోకి బండారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 70మందితో చేరి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన పోవాలంటే జనసేనాని పవన్ కళ్యాణ్ అధికారం చేపట్టాలని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదని వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ఆయన కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుణదల కిషోర్, రాష్ట్ర కోఆర్డినేటర్ పేలా విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు సుధీర్, కలిగిరి మండల అధ్యక్షులు దిలీప్‌కుమార్, జనసేన నాయకులు సిద్ధు, సురేష్, సంతోష్, వెంకట్, రామచైతన్య, శ్రీనివాసులు, సత్యనారాయణ, రవీంద్ర, రసూల్, కృష్ణ, నాగేశ్వరరావు, తదితరులున్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : విశ్వోదయ రిటైర్డ్ టీచర్స్ వినయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డి.ఆర్. విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్‌లోని తమ కార్యాలయంలో రూ.50వేలు విలువ చేసే బియ్యం, వంటిలిటి సరుకులు రూ.60 నగదు 60 మంది నిరుపేద వృద్ధులకు పంపిణీ చేశారు. సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ డి.ఆర్. విద్యాసాగర్, దార్లనిశుదు అని, వెలగపూడి విద్యార్థుల ఫీజులతో వెలుగు నింపిన మహోన్నత వ్యక్తి అన్నారు. సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర రెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌రెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

## 'సంయుక్త'లో ఎన్ఆర్ఐల సందర్శన

**ప్రజాశక్తి-కావలి** : ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ రవి కుమార్ – డాక్టర్ బెజవాడ విజయ దంపతుల కుమారుడు, కోడలు వృత్తి రీత్యా విదేశాల్లో ఉంటున్న డాక్టర్ బెజవాడ వినీల్ – డాక్టర్ బెజవాడ సాయి సదాప్రియ ఆదివారం వెంగళరావు నగర్లో ఉన్న సంయుక్త సేవా సంస్థ కార్యాలయానికి సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలను సందర్శించి, వారితో ఎంతో ఆప్యాయంగా గడిపారు. పిల్లలను దగ్గరకు తీసుకొని వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

## 40వ వార్డులో 'మహాశక్తి'

**ప్రజాశక్తి - కావలి** : స్థానిక 40వ వార్డులో కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం ఆదివారం మహిళలు "మహాశక్తి కార్యక్రమం" నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ వారికి మహాశక్తి స్టిక్కర్లు అతికిస్తూ, టిడిపి ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహాశక్తి మహిళా నేతలు కొల్లూరు అశ్విని, గోళ్ల అమర శ్రేణి, రాపూరు రాధమ్మ, జహీరా బేగం, మహిళా నాయకులు షేక్.రజియా, ఫారూక్, జమ్మూ శ్రీనివాసులు, పసుపులేటి ఆనందమ్మ బి.పద్మ, అధిక సంఖ్యలో యువత, మహిళలు ఉన్నారు.

## కోవూరు అభివృద్ధికి కృషి చేస్తా..

**ప్రజాశక్తి-విడవలూరు** : కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా దంపూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామంలో వైసిపి ప్రభుత్వం ఏ అభివృద్ధి జరిగిందో తెలుసుకొని దానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామస్తులు దినేష్‌రెడ్డికి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కృష్ణచైతన్య, శ్రీనివాసులు, దూది విజయ రాఘవన్, చెక్క మదన్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆనం ఆశీర్వాదం

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని డిసిపల్లి గ్రామానికి చెందిన బిలకా చిన్న వెంగళరెడ్డి - భూదేవమ్మ కుమారుడు వేణురెడ్డి వివాహవేడుకల కార్యక్రమంలో మాజీ మంత్రి, వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

## తల్లిదండ్రుల సమావేశం

**ప్రజాశక్తి-కావలి** : కావలి బిసి బాలికల వసతి గృహ సంక్షేమాధికారి, నాగేశ్వరి, బిసి కళాశాల బాలికల వసతిగృహం సంక్షేమాధికారి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం, నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి సహాయ బీసీ సంక్షేమాధికారి కె.సుధాకర్ హాజరైనారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూను తప్పకుండా పాటించాలని విద్యార్థుల సౌకర్యాల కల్పనపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవఅతిథులుగా విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి షేక్ ఖాదర్‌బాషా, విశ్వోదయ బాలికోన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు, లక్ష్మి మాధవి పాల్గొన్నారు.

# దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా మలేరియా అధికారిణి ఇ.హుస్సేనమ్మ**

**ప్రజాశక్తి-నెల్లూరు**

**రానున్న వర్షాకాలంలో దోమలు పుట్టకుండా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని ల్లా మలేరియా అధికారిణి ఇ.హుస్సేనమ్మ అన్నారు. దోమలు చూసేందుకు చిన్న ప్రాణాలే.. ఎటువంటి వారైనా సరే.. అటువంటి దోమల కాటుకు గురై మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడాల్సిందే. ఈ వ్యాధులకు గురైన వారు తీవ్రమైన అనారోగ్యంతో చికిత్సల నిమిత్తం వైద్యశాలలకు పరుగులు తీయాల్సిందే. వర్షాకాలం ఈ దోమల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో దోమల కాటుకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో జిల్లా మలేరియా అధికారిణి ఇ.హుస్సేనమ్మ మాటల్లో..**

**ప్రశ్న. దోమల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. జిల్లాలో దోమ కాటుకు గురై మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు ఎంత మంది గురయ్యారు..?**

**జవాబు.** వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వారంలో ఒక రోజు అంటే ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. అదే సమయంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. పొరపాటున ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని తొలగించి దోమల గుడ్లు (ల్వారా) నాశనం చేస్తున్నాం. ఈ ఏడాది డెంగీ కేసులు 98, మలేరియా కేసులు 4 నమోదయ్యాయి. డెంగీ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పర్యటించి వ్యాధిగ్రస్తుల ఇంటి చుట్టుపక్కల ఉన్న వారి రక్తనమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. అదే సమ యంలో ఈ వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు ప్రజలను చైతన్య పరిచి, దోమల నివారణకు ఎటు వంటి చర్యలు తీసుకోవాలో తెలియజేస్తున్నాం.

**ప్రశ్న. గడిచిన ఐదు సంవత్సరాల్లో జిల్లాలో ఎంత మంది మలేరియా, డెంగ, చికున్‌గున్యా వ్యాధులతో బాదపడ్డారు. మరణాలు ఎమైనా సంభవించాయా..?**

**జవాబు.** తాను జిల్లా మలేరియా అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ఈ వ్యాధులతో మరణించిన వారు లేరు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న లెక్కలను అనుసరించి 2019లో 3852 మంది అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా 155 మందికి నిర్ధారణ అయింది. 2020లో 1,140 మంద అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 28కి నిర్ధారణ అయింది. 2021లో 4,109 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 139కి నిర్ధారణ అయింది. 2022లో 6789 మంది అనుమానితుల నుంచి రక్తనమూనా సేకరించి పరీక్షలు చేయగా 115 మందికి నిర్ధారణ అయింది. 2023 ఆగష్టు నెల వరకు 3,418 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 98 మందికి నిర్ధారణ అయింది. మలేరియా కేసులు 2019లో 1,57,768 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 34 నిర్ధారణ అయింది. 2020లో 3,05,213 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా 11కి వ్యాధి నిర్ధారణ అయింది. 2021లో 3,26,365 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 11 మందికి నిర్ధారణ అయింది. 2022లో 3,20,155 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా 3 కేసులు నిర్ధారణ అయ్యాయి. 2023 ఆగష్టు చివరినాటికి 1,93,352 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 4 మందికి మాత్రమే నిర్ధారణ అయింది. 2022లో 22 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా ఒకరికి మాత్రమే చికెన్ గున్యా నిర్ధారణ అయింది.

**ప్రశ్న. ఈ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. దోమతెరలు ఏయే ప్రాంతాల్లో పంపిణీ చేశారు..?**

**జవాబు.** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారంలో ఒక రోజు తప్పని సరిగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, స్ప్రే కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రూప్ సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హైరిస్క్ కలిగిన ప్రాంతాలైన రాపూరు, డక్కిలి దోమల నివారణకు 57900 దోమతెరల పంపిణీ చేశాం. జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో మురుగు నీరు నిలువ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు దోమ గుడ్లు, ల్వారాలను నాశనం చేసేందుకు మత్స్యశాఖ అధికారుల సహాయంతో గంభూజియా చేపలను వదిలిపెట్టేందుకు మత్స్యశాఖ సహకారంతో ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.

**ఇంటర్వ్యూ**

# 'పల్లెపల్లెకు పసుపులేటి' ప్రారంభం

పసుపులేటికి ఘన స్వాగం పలుకుతున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి-కావలి రూరల్**

కావలి నియోజవర్గంలోని ప్రతి పల్లెకు పసుపులేటి సుధాకర్ తలపెట్టిన 'పల్లెపల్లెకు పసుపులేటి' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు మండల పరిధిలోని నందిమ్మ పురం గ్రామంలో ఉన్న నందీశ్వరుని గుడిలో పసుపులేటి దంపతులు ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందిమ్మ పురం గ్రామంలోని ప్రజలు మంగళ వాయిద్యాలతో బ్యాండ్ బజా మేగిస్తూ భారీగా బాణాసంచా పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని మహిళలు పసుపులేటి సుధాకర్‌కు అడుగడుగునా దిష్టితీస్తూ, హారతులు పడుతూ పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ తానున్నా అని భరోసానిస్తూ పసుపులేటి సుధాకర్ ముందుకు సాగారు. అనంతరం నందిమ్మపురంలో పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులు పసుపులేటి సుధాకర్‌కు వారి సమస్యలను తెలియజేశారు. అనంతరం పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే పల్లెకు పసుపులేటి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు తెలిపిన సమస్యలను పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరిష్కరిస్తామని వారికి హామీనిచ్చారు. నందిమ్మ పురం నుంచి సాగిన పసుపులేటి పల్లెకు కార్యక్రమం సీతారామనగరం, కొత్త నందిమ్మ పురం, పల్లెపాలెం, చిన్నపట్టపుపాలెం, పెద్ద పట్టపు పాలెం మీదగాసాగింది. అనంతరం పెద్ద పట్టపు పాలెంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, నందిమ్మ పురం గ్రామపెద్దలు, పెద్ద పట్టపాలెం గ్రామ పెద్దలు, పసుపులేటి సుధాకర్ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'సాయిరాం' హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాశక్తి-నెల్లూరు**

నెల్లూరుకు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ లలిత షిరిడిషా ఆధ్వర్యంలో నిర్మించిన సాయిరాం హాస్పిటల్ నూతన భవనం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ నూతన భవనంలో యూరాలజీలో లేజర్ ట్రీట్మెంట్, లేపరోస్కోపిక్ సర్జరీ, డయాలసిస్ యూనిట్, ఐసియు అందుబాటులో ఉన్నాయన్నారు. గైనకాలజీ విభాగంలో కాన్పులు, గర్భకోశ వ్యాధుల తోపాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సంతాన సాఫల్యత చికిత్స కేంద్రం (ఐ.వి.ఎఫ్)ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటితోపాటు 24 గంటలు డ్యూటీ డాక్టర్లు, ఫార్మసీ, ల్యాబ్ సౌకర్యాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు తాము అందించే అత్యుత్తమ వైద్య సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యులు హాజరై వారిని అభినందించారు.

## సిపిఎం నాయకులు ఖాజావలీ మృతి

**- పలువురు సంతాపం - ఖాజావలీ అవయవాలు దానం**

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

సిపిఎం సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి (85) వృద్ధాప్యం కారణంగా ఆయన కుమార్తె నివాసంలో శనివారం రాత్రి 4.30 గంటలకు తుది శ్వాస విడిచాడు. ఆయన స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ తుదిశ్వాస వరకు పార్టీ శ్రేయస్సు కోసం పనిచేశాడు. స్వగ్రామం ఎఎస్‌పేట మండలం గుడిపాడు గ్రామం. ఖాజావలి రైతు సంఘం – కార్మిక సంఘం, ఆంధ్ర ప్రజానాట్య మండలిలో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. గ్రామం చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో పేద ప్రజల హక్కుల కోసం వారి సమస్యలపై పోరాటాలు చేశారు. ఖాజావలి తన మరణాంతరం తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగంగా ఉండే విధంగా వైద్యశాలకు అప్పగించాలని కోరుతూ నెల్లూరు పినాకిని దేహ సమర్పకుల సంస్థకు గత 20 సంవత్సరాలలో క్రితం దేహ సమర్పణ ప్రమాణ పత్రం అందజేశారు. ఆయన కోరిన విధంగా కుటుంబ సభ్యులందరూ అంగీకరించి ఆయన భౌతికకాయాన్ని వైద్యశాలకు అప్పగించారు. ఖాజావలీ భౌతికకాయాన్ని ప్రజలు సందర్శనార్థం స్థానిక సిపిఎం కార్యాలయం లో ఆదివారం ఉంచారు. అనంతరం అక్కడ స్మారక సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు నిర్వహించారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సిపిఎం జిల్లా నాయకులు గంటా లక్ష్మీపతి, న్యాయవాది శేషారెడ్డి, కెవిపిఎస్ నాయకులు ఆత్మకూరు నాగయ్య, టౌన్ పార్టీ నాయకులు షేక్ సంధాని, ఎం నాగేంద్ర, పి.జిలాని, రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్, సిఐటియు నాయకులు జివి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, ఆళ్ల హజరత్తయ్య, వాగాల శ్రీహరి, హరికృష్ణ, ఎల్ఐసి రమేష్, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, కొండా లక్ష్మమ్మ, కెవిపిఎస్ నాయకులు వెంకటయ్య, ఖాజావలి కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు పాల్గొని ఖాజావలి మృతికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

## మహాధర్నా జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి-బిట్రగుంట** : శంభుని రెడ్లను ఎస్‌సి జాబితాలో చేర్చడంపై నిరసనగా సోమవారం దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి ఆధ్వర్యంలో కావలిలో చేపడుతున్న ధర్నా కార్యక్రమాన్ని బోగోలు మండలంలో ఉన్న మాల, మాదిగలు, ఇతర దళిత సోదరులు జయప్రద చేయాలని బోగోలు జైభీమ్ సేవ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంభుని రెడ్ల కులస్తులను ఎస్‌సి జాబితాలో చేరుస్తామని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇచ్చిన మాటకు నిరసనగా సోమవారం మాల, మాదిగలు కావలి ఆర్‌డిఒ ఆఫీస్‌లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కావలి శాసనసభ్యుడికి దళితులను చిన్నచూపు చూస్తున్నారని, దళితులకు రావాల్సిన రిజర్వేషన్ ఇతర కులస్తులకు ఇప్పించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

# సూర్జిత్ భవన్‌కు తాళాలు వేయడం దారుణం

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్**

న్యూఢిల్లీలో జి–20కి సంబంధించిన ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించేందుకు న్యూఢిల్లీలో హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సెమినార్ కమ్ వర్క్‌షాప్‌ను ఆపేందుకు ఢిల్లీ పోలీసులు యత్నించయడాన్ని ఆత్మకూరు సిపిఎం నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం సిపిఎం కార్యాలయం నుండి మున్సిపల్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ అసమ్మతి గళాలను నొక్కేసే ఇలాంటి ప్రయత్నాలు ఎంతమాత్రం సమంజసనీయం కాదన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో జరిగే శాఖరాగ్ర సదస్సును పురస్కరించు కొని శుక్రవారం నుంచి ఆదివారం వరకు వియ్–20 సదస్సును నిర్వహించాలని ప్రజాసంఘాల వేదిక నిర్వహించిందని తెలిపారు. దానికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన మేధావులు, ఆర్థికవేత్తలు, రాజకీయ నేతలు, పాత్రికేయులతో పార్టీల కతీతంగా సదస్సులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సదస్సులు వివిధ అంశాలపై ప్రత్యామ్నాయ విధానాలను చర్చిస్తారని తెలిపారు. రాజధానిలో చర్చలు సెమినార్లు నిర్వహించుకునేందుకు పౌరులకు ప్రజాస్వామ్య హక్కులలో ఢిల్లీ పోలీసుల ద్వారా జోక్యం చేసుకునే ప్రయత్నాలను మోడీ ప్రభుత్వం తక్షణమే ఆపుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జివి శివప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్, ఐద్వా నాయకురాలు షేక్ గుల్జార్ బేగం, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర, ఆళ్ల.హజ రత్తయ్య, వాగాల శ్రీహరి, కొండ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి రూరల్** : జి–20 సమావేశాలను పురస్కరించుకొని వియ్ ఆధ్వర్యంలో హరికిషన్ సూర్జిత్ సింగ్ భవనంలో 70కి పైగా వివిధ ప్రజాకార్మిక పౌర సంఘాలు మేధావులు పాల్గొని నిర్వహిస్తున్న సెమినార్‌ను అడ్డుకొనేందుకు ఢిల్లీ పోలీసులు భవనం గేట్లకు తాళాలు వేసి అడ్డుకోవడంపై ఆదివారం సిపిఎం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కావలిలో ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేఇలాంటి దుర్మార్గమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని హితవుపలికారు. అణిచివేత ధోరణి ఉన్న బిజెపి ప్రభుత్వ పాలనకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్ రావు, ఎస్‌కె.అమీర్ భాషా, కె,చెన్నయ్య, తలపల రత్నం, మేడ వెంకటేశ్వర్లు, ఎస్‌కె.మస్తాన్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-జలదంకి** : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు సుర్జిత్ భవనానికి తాళాలు వేయడాన్ని సిపిఎం సీనియర్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో వియ్20 సమావేశానికి సంబంధించి ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించేందుకు హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్లో ఏర్పాటుచేసిన సెమినార్ కం వర్క్ షాపులు ఆపేందుకు ఢిల్లీ పోలీసులు తాళాలు వేయడాన్ని సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి తీవ్రంగా ఖండించారు. సిపిఎం బ్రాహ్మణక్రాక గ్రామ కార్యదర్శి గడ్డం మాల్యాద్రి, జలదంకి గ్రామ కార్యదర్శి ఎం.ఆంథోని బాబు, జమ్మలపాలెం శాఖ కార్యదర్శి అడపాల సురేష్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ముతుకూరు** : ముత్తుకూరు మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ భారతదేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తూ పౌర హక్కులను హరిస్తున్నారన్నారు. సిపిఎం నాయకులు గోడా భాస్కర్, తాంద్ర రామయ్య, జాన్ పాస్టర్ వాసు, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి-ముత్తుకూరు** : మండలంలోని కోళ్లమిట్ట గ్రామంలో సాగరమాల హైవే రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతుల సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగలి పుల్లయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం వద్దకి రైతులందరూ రావాలని ఆయన కోరారు. ఈ ప్రాంతంలో సాగరమాల హైవే రోడ్డుకి భూములు కోల్పోతున్న రైతులకి ఎకరాకి రూ.80 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు, నాయకులు గడ్డం అంకయ్య, నక్క రాధయ్య, బ్రహ్మదేవి మోహన్ రావు, దుంపల ఏడుకొండలు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ తిరుమలకు కాకర్ల అభినందనలు

**ప్రజాశక్తి-జలదంకి** : మండలంలోని లింగరాజు అగ్రహారం పంచాయతీ సర్పంచ్‌గా విజయం సాధించిన మంగళ తిరుమలకు కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపికి అండగా నిలిచి పార్టీ అభ్యర్థి మంగళ తిరుమలను గెలిపించిన కొర్రపాటి రామారావు, గుర్రం ప్రవీణ్, పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఉదయగిరి నియోజకవర్గ నేతలు, మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు కాకర్ల ట్రస్ట్ అందించిన సేవలు కూడా ఎల్ఆర్ అగ్రహారం పార్టీ విజయానికి కారణమైందని కాకర్ల సురేష్ తెలిపారు. ఎన్నో సేవా కార్యక్రమాలు టిడిపిపై ప్రజలు మొగ్గు చూపడంలో కలిసి వచ్చాయని గ్రామస్తులు చర్చించుకున్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు ఉదయగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దుద్దుకూరు రమేష్ నాయుడు నిర్వహించారు. ఆదివారం స్థానిక మీడియా పాయింట్ ఆవరణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు, డిసిసి అధ్యక్షులు దేవకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నా మన్నారు. అతిపిన్న వయసులోనే దేశ 7వ ప్రధానిగా కాంగ్రెస్ పార్టీ దేశ ప్రధాని రాజీవ్ గాంధీనేని అలాంటి మహనీయులు జయంతి జరుపుకోవడం సంతోషం గా ఉందన్నారు. 2024లో దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ కావడం ఖాయమన్నారు. ఆయన ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ జోడోయాత్ర ప్రజల అపూర్వ ఆదరణతో విజయవంతంగా ముగిసిందని తర్వాత చేపట్టే నాలుగు రాష్ట్రాల్లో కూడా మరింతగా ప్రజలు ఆదరణ పొంది విజయ వంతం అవుతుందన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఉదయగిరి ఎంఎల్ఎ తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధికి ముందుగా ఉదయగిరిని జిల్లాగా ప్రకటిస్తామని దుర్గం సిద్ధేశ్వరం పర్యాటక కేంద్రం చేసి వ్యవసాయానికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రతి లింకు రోడ్డును డబుల్ రోడ్డుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సత్తెనపల్లి బాలయ్య, సీతారాంపురం, వరికుంట పాడు అధ్యక్షులు కానాల హజరత్, దుద్దుకూరు వెంకటేశ్వర్లు, బకీరు హజరత్, యూత్ నాయకులు ప్రశాంత్, అంకయ్య నాయుడు తదితరులున్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు ఆదేశానుసారం పిసిసి ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చేవూరు శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వన్నం నాగరాజు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి పురస్కరించుకొని మున్సిపల్ బస్టాండ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగపట్ల రాంకి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎస్‌డి రసూల్, కొండ సతీష్, సుల్తాన్, మైనారిటీ నాయకులు షేక్.మస్తాన్, ఎస్‌డి బషీద్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి** : మాజీ ప్రధాన మంత్రి, కాంగ్రెస్ నేత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు కావలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి చింతాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ట్రంక్ రోడ్డులోని ఆర్అండ్‌బి బంగ్లా ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంకేతిక విప్లవాన్ని రాజీవ్ గాంధీ తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్ బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మానస, కరుణాకర్, అంకయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కాపుల ఎంపిక

**ప్రజాశక్తి-అల్లూరు** : అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని తీరప్రాంత గ్రామమైన ఆదినారాయణపురంలో ఆదివారం గ్రామకాపుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నలుగురు గ్రామ కాపులను ఎంపిక చేశారు. పెదకాపు పొన్నపూడి గోవిందు, రెండో కాపు కొండూరు తిరుపతయ్య, మామిడి సుబ్బయ్య, కోశాధికారి వాయిల సీనయ్యలను ఎంపిక చేశారు.

వీరి పదవీకాలం నేటి నుండి మూడు సంవత్సరాల పాటు ఉంటుంది. కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ప్రతినిధులుగా మాజీ వైస్ ఎంపిపి అనంతరాజు బాలకృష్ణ రాజు, ఎరటపల్లి శేఖర్ రెడ్డి హాజరై గ్రామకాపులను సన్మానించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, తీరప్రాంత మత్స్యకార గ్రామకాపు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్ అందజేత

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు చెందిన యువతకు మున్సిపల్ వైస్ చైర్మన్, అభిరామ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్ చిన్న కుమారుడు అభిరామ్ చేతులు మీదుగా ఆదివారం యువతకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. గతంలో వార్డు పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా యువత క్రికెట్ కిట్ కావాలని డాక్టర్ శ్రావణ్‌ను కోరడంతో ఆయన స్వంత నిధులతో క్రికెట్ కిట్‌ను తెప్పించి వైసిపి వార్డు ఇన్‌ఛార్జి ప్రసాద్‌తో కలసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ యువతను క్రీడలపై ప్రోత్సహించే లక్ష్యంగా ఈ క్రీడాసామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు.

## కార్మిక నిధులు విడుదల చేయాలి

**ప్రజాశక్తి-ముత్తుకూరు**

సంక్షేమ బోర్డు నుంచి నిధులను విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి గోడ భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రామిక భవనంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం ముత్తుకూరు మండల విస్తృత సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సిఐటియు కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షులు గడ్డం అంకయ్య, భవన నిర్మాణ కార్మికులు మురళీకృష్ణ, అన్నల బలరామయ్య, ఆలపాక పెంచలయ్య, పాశం వాసు, గోనెల పెద్ద మస్తానయ్య, కుడుముల హరీష్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**డాక్యుమెంటు పోయినది**

**కలువాయి అనితారాణి, భర్త కలువాయి వెంకట కృష్ణారెడ్డి,** డోర్ నెం.24-2-492, సరస్వతి నగర్, దర్గామిట్ట, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా(ఎ.పి.). అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా **తే02-08-2023దిన** జెరాక్స్ నిమిత్తం బాలాజీ నగర్ మెయిన్ రోడ్‌కు వెళ్ళినప్పుడు **తే24-01-1977దిన** నెల్లూరు రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ **వీలునామా డాక్యుమెంట్ నెం.11/1977** పోయినది. ఎవ్వరికైనా దొరికినయెడల పై చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
**కలువాయి అనితా రాణి**

**IN THE COURT OF THE 8th ADDITIONAL DISTRICT JUDGE, ONGOLE**
**EP.No: 794/2019**
**AR.C.NO. 418/2017**

**Between:**
M/S Shriram City Union Ltd.,Chirala. Rep by its Divisional Executive/G.P.A Holder ...D.H.R

**Vis**

Manne Suresh and & Others ...J/D.RS

**To**
2. Kumba Koteswara Rao,
S/o Veeraswamy, aged 38 years
Working as Police Constable
P.C.No. AR2717, S.P. Office, Nellore,
Nellore District.

పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తము తేది: 04-09-2023 వాయిదా ఉన్నది. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లాయరు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోవలసినది. లేని యెడల మీపరోక్షమున సదరుదావా తీర్మానించబడునని తెలియచేయడమైనది.

**PASUMARTHY SRIDHAR**
**IMMADISETTY SIVA JYOTHI**
**Advocates**
**A-17, Nvavavadi Sadan**
**District court premises**
**Ongole**